www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 26 మే 2025
5
చిత్తూరు



నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈ నెల 26వ తేదీ సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు ఉదయం 9 గంటల కల్లా తప్పక హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీనితో పాటు నియోజక వర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

వైభవంగా చంద్రబాబు ఇంటి గృహప్రవేశం

- తరలివచ్చిన నియోజకవర్గ ప్రజలు
- ఐదు గంటల పాటు ప్రత్యేక పూజలో ముఖ్యమంత్రి

ప్రజాశక్తి- కుప్పం రూరల్

కుప్పం నియోజకవర్గం, శాంతిపురం మండలం, శివపురం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నూతన గృహప్రవేశం వైభవంగా జరిగింది. ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు గృహప్రవేశ పూజా కార్యక్రమాలు జరిగాయి. మంగళ వాయిద్యాలు వేద పండితుల వేదమంత్ర అర్చనలతో నూతన గృహంలోకి ప్రవేశించారు. అనంతరం పూజా కార్యక్రమం నిర్వహించి గోవులకు పూజలు చేశారు. పూజ తరువాత ముఖ్యమంత్రి కోడలు బ్రాహ్మణి పొయ్యిపై పాలు పొంగించారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు సంప్రదాయపద్ధతిలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు ముగించుకున్న అనంతరం ఉదయం 10 గంటలకు టీడీపీ కుటుంబ సభ్యులు, ప్రజలు చంద్రబాబు దంపతులకు శుభాకంక్షలు తెలిపారు. ఈ శుభ కార్యక్రమానికి వచ్చే వారందరికీ పసందైన పలు రకాల విందు వంటకాలూ సిద్ధం చేశారు. కుప్పంలోని కొత్త ఇంటి గృహప్రవేశం నేపథ్యంలో సీఎం చంద్రబాబుతోపాటు ఆయన కుటుంబ సభ్యులందరూ శనివారం రాత్రికే కుప్పం చేరుకున్నారు. చంద్రబాబు తరఫున ఆహ్వానాలు అందుకున్న నియోజకవర్గ ప్రజలు, టీడీపీ కార్యకర్తలు ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

పసందైన వంటకాలు..

శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ పరిధిలోని శివపురం వద్ద రెండెకరాల స్థలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నూతన గృహాన్ని నిర్మించుకున్నారు. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శనివారం మధ్యాహ్నమే కుప్పం చేరుకుని పీఈఎస్ వైద్య కళాశాల అతిథి గృహంలో బస చేశారు. నూతన గృహానికి వెళ్లి, అక్కడి గృహప్రవేశ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతులు శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో కుప్పం చేరుకున్నారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధరాత్రి తర్వాత కుప్పం వచ్చారు. మరోవైపు గృహప్రవేశ ఏర్పాట్లు ఘనంగా జరిగాయి. సుమారు 25 వేలమందికి భోజనాల ఏర్పాట్లు చేశారు. ఇందుకు అవసరమైన ప్రత్యేకమైన షెడ్లను నూతన గృహ పరిసరాలలో నిర్మించారు. శనివారం రాత్రి ఇంటి వద్ద బంధుమిత్రులకు, వీఐపీలకు భోజనాలు చేసి వడ్డించారు. ఆదివారం మధ్యాహ్నం వేల సంఖ్యలో ప్రజలకు భోజనాలు చేశారు. వీవీఐపీ, వీఐపీ, సాధారణ గ్యాలరీలను ఇందుకోసం సిద్ధం చేశారు. శనివారం మధ్యాహ్నం నుంచే వంట ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. నారా భువనేశ్వరి దగ్గరుండి మరీ వంటకాలను సిద్ధం చేయించడమే కాక, అవసరమైన ఏర్పాట్లు చూసుకుంటున్నారు. 25 వేలమంది సాధారణ ప్రజలకు, 2 వేలమంది వీఐపీలకు భోజనాలు వండి వడ్డించారు.


ఇంటింటికీ ఆహ్వాన పత్రిక

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గృహప్రవేశం సందర్భంగా 20 రోజుల క్రితమే నారావారి గహప్రవేశం ఆహ్వానం పేరుతో నియోజకవర్గంలోని కుప్పం, రామకుప్పం, శాంతిపురం, గుడిపల్లి మండలాల్లోని ప్రజలకు ఇంటింటికి ఆహ్వాన పత్రిక కార్యకర్తల ద్వారా అందించారు. ఆదివారం జరిగిన గహప్రవేశ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజలు వేలాదిగా తరలించారు. వారి కోసం మూడు ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేసి అందులో 12రకాల అల్పాహారం విందు, 24 రకాల భోజనాలు వడ్డించారు. అనంతరం చంద్రబాబు నాయుడు నియోజకవర్గం ప్రజల నుంచి సమస్యలతో కూడిన అర్జీలు స్వీకరించారు. నూతనంగా నిర్మించిన ఇంటిలోనే కుప్పం డెవలప్మెంట్ అథారిటీ అధికారులతో నియోజక అభివద్ధిపై సమావేశమయ్యారు. అనంతరం టిడిపి కుప్పం శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. వచ్చిన అశేష ప్రజానీకం ముఖ్యమంత్రి గారి దంపతులతో ఫోటోలు దిగడం మరపురాని జ్ఞాపకంగా వారి హృదయాలలో నిలుపుకున్నారు. కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి ప్రసాదాలను ఆలయ ఈవో పెంచల కిషోర్ సిఎంకు అందించగా అనంతరం వేదపండితులు ఆశీర్వాదం చేశారు.

ప్రజలు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్, డిఎఫ్ఓ భరణిని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి నూతన సొంతింటి వద్ద భద్రతా ఏర్పాట్లను అనంతపురం రేంజ్ డిఐజి షిమోషి, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పర్యవేక్షించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సిఎం సొంతింటి గృహప్రవేశ ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించారు. ముఖ్యమంత్రి దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో చిత్తూరు ఎంపీ దుగ్గిమళ్ల ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమర్నాథరెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, రాష్ట్ర ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివాని శ్రీనివాసులు, నాయకులు డాక్టర్ సురేష్ బాబు, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

చిత్తూరు సమస్యలు సీఎం దృష్టికి..

చిత్తూరు అర్బన్: జిల్లా విభజన తర్వాత చిత్తూరుకు యూనివర్సిటీ కేటాయించాలని, అడవిపల్లి రిజర్వాయర్ పూర్తిచేసి నీటి సౌకర్యం కల్పించాలని, చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్మెంట్ సొసైటీ ప్రతినిధులు రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతినిధులు గోపి నాయక్, వైస్ ప్రెసిడెంట్లు సత్య, రిటైర్డ్ ఎస్పై మురళి సిఎంను కలిసి చిత్తూరు అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు.



ప్రత్యేక పూజలో ముఖ్యమంత్రి కుటుంబం



కొత్త ఇంట్లో పాలు పొంగిస్తున్న నారా బ్రాహ్మణి



ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు



విందు భోజనాలు చేస్తున్న ప్రజలు

కొండపై కిటకిట

- తిరుమలలో వేసవి రద్దీ..
- పోటెత్తిన భక్తులు...
- నిరంతరాయంగా అన్నప్రసాదాలు
- శ్రీవారి సేవకుల విశేష సేవలు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వేసవి సెలవుల కారణంగా గత వారం రోజులుగా తిరుమలలో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగింది. ఈ క్రమంలో అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా టీటీడీ చర్యలు తీసుకుంటోంది. వైకుంఠం కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు, బయట క్యూలైన్లలో వేచి ఉన్న భక్తుల కోసం టీటీడీ నిరంతరాయంగా అన్నప్రసాదం, తాగునీటి పంపిణీ ఏర్పాట్లను విస్తృతంగా చేపట్టింది. టీటీడీ యంత్రాంగం కృషితో శనివారం రోజున 90,211 మంది భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యం కలిగింది. మే నెలలో 24 రోజుల వ్యవధిలో తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంతో పాటూ ఇతర అన్నప్రసాద కేంద్రాల్లో కలిపి 51 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ జరిగింది. అలాగే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు, బయట క్యూలైన్లలో మరో 20 లక్షల మందికి పాలు, టీ, కాఫీ, మజ్జిగ, స్నాక్స్ పంపిణీ చేశారు. మే నుంచి ప్రతిరోజూ సగటున 2.5 లక్షల అన్నప్రసాదాలు, 90 వేలకు పైగా అల్పాహారాలు, పానీయాలు అందిస్తున్నారు. మే 24న ఒక్క రోజే మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో 93,950 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అదే రోజు బయట క్యూలైన్లు, వైకుంఠం ప్రాంతాల్లో 2.72 లక్షల అన్నప్రసాదాలు, 1.17 లక్షల పానీయాలు అందించారు.

ఆరోగ్యశాఖ విస్తృత సేవలు

క్యూలైన్లలో నిరంతరాయంగా తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రతను ఆరోగ్యశాఖ నిర్వహిస్తోంది. మొత్తం 2,150 మంది శానిటరీ కార్మికులు, సూపర్వైజర్లు, మేస్త్రీలు, ఇన్‌స్పెక్టర్లు, యూనిట్ అధికారులు భక్తుల కోసం 24 గంటలు సేవలు అందిస్తున్నారు.

శ్రీవారి సేవకుల విశేష సేవలు

తిరుమలలో ప్రతిరోజూ దాదాపు మూడు వేల మంది శ్రీవారి సేవకులు భక్తులకు విస్తృత సేవలు అందిస్తున్నారు. క్యూలైన్లలోని భక్తులకు నిరంతరాయంగా నాలుగు షిఫ్టులలో అన్నప్రసాదాలు, తాగునీరు పంపిణీ చేస్తున్నారు. వీరి సేవలను శ్రీవారి సేవ గ్రూప్ సూపర్‌వైజర్లు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

క్యూలైన్లు సమర్థవంతంగా నిర్వహణ

విజిలెన్స్, ఆలయ విభాగాలు దర్శన క్యూలైన్లను సమర్థంగా నిర్వహిస్తున్నాయి. గత మూడు రోజుల్లో దాదాపు 2.4 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. కల్యాణకట్ట, మెడికల్, రేడియో, రిసెప్షన్, బ్రాడ్ కాస్టింగ్ తదితర విభాగాలు కూడా భక్తులకు అవసరమైన సేవలను నిరంతరాయంగా అందిస్తున్నాయి.




ఫ్లోరోసిస్‌పై జాగ్రత్తలు పాటిద్దాం..

ఇంటర్వ్యూ

డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సుధారాణి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:



రాష్ట్రంలో 21 జిల్లాలలో ఫ్లోరైడ్ ప్రభావం ఉండగా అందులో చిత్తూరు జిల్లా కూడా ఒకటి. జిల్లాలో 9 మండలాలలో 15 గ్రామాలలోని 34 ఆవాసాలలో ఫ్లోరైడ్ ప్రభావం ఉంది. జీడీ నెల్లూరు, గుడిపాల, ఐరాల, పుంగనూరు, పూతలపట్టు, తవనంపల్లి, యాదమరి మండలాలలో అధిక ఫ్లోరైడ్ ప్రభావం ఎక్కువగా ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ సుధారాణి తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో జిల్లాలలో ఫ్లోరైడ్ ప్రభావం పై వైద్య ఆరోగ్య శాఖ చేపడుతున్న కార్యక్రమాలను ఆమె వివరించారు.

ప్రజాశక్తి: జిల్లాలలో ఫ్లోరైడ్ ప్రభావం ఉన్న మండలాలు ఎన్ని?

డిఎం అండ్ హెచ్‌ఓ: చిత్తూరు జిల్లాలో ఫ్లోరైడ్ ప్రభావంతో 9 మండలాలు గుడిపాల, జీడీ నెల్లూరు, ఐరాల, పుంగనూరు, పూతలపట్టు, తవణంపల్లి, యాదమరి ప్రాంతాల్లోని 15 గ్రామాల్లోని ప్రజలు ఫ్లోరైడ్ ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజాశక్తి: జిల్లాలో ఫ్లోరైడ్ ప్రాంతాల్లో వైద్యఆరోగ్య శాఖ ఎలాంటి కార్యక్రమాలు చేపట్టబోతోంది?


డిఎం అండ్ హెచ్‌ఓ: జూన్ మొదటి వారంలో విద్యా సంవత్సరం ప్రారంభం తర్వాత 11 సంవత్సరాల లోపు బడి పిల్లలకు డెంటల్ ఫ్లోరోసిస్, స్కెలిటల్ ఫ్లోరోసిస్ స్క్రీనింగ్ పరీక్షలు చేపడుతాం. ఫ్లోరోసిస్ అనుమానిత పిల్లలకి మల్టీ విటమిన్ కాల్షియం, విటమిన్ సి మాత్రలు అందజేయడం జరుగుతుంది.

ప్రజాశక్తి : ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్న వారికి ఎలాంటి చికిత్స అందిస్తారు.....?

డిఎం అండ్ హెచ్‌ఓ: కమ్యూనిటీ సర్వేలో స్కెలిటల్ ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్న వారికి నెక్‌బెల్ట్, లంబార్ బెల్ట్, వాకింగ్ స్టిక్స్, వాకర్, వీల్ చైర్స్, టాయిలెట్ చైర్స్ వంటి పరికరాలు అందిస్తాం. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండి వారికి సర్జరీ అవసరం అయిన వారికి ఉచిత రీహాబిలిటీ సర్వీసెస్ అందించడం జరుగుతుంది.

ప్రజాశక్తి: ఫ్లోరైడ్ వ్యాధి బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు వైద్య ఆరోగ్య శాఖ చేపడుతోంది?

డిఎం అండ్ హెచ్‌ఓ: ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలలో వ్యాధి బారిన పడకుండా వైద్యసేవలు అందిస్తున్నాం. ప్రజలందరూ సురక్షితమైన నీరుని తీసుకోవాలి, పొగాకు, సైంధవ లవణం, బ్లాక్ కాఫీ, ప్యాకెట్ ఫుడ్స్‌లో అధిక ఫ్లోరైడ్ కలిగి ఉంటాయి కావున అటువంటి ఆహార పదార్థాలను తీసుకోకూడదు. అలానే ఫ్లోరైడ్ ఉన్న టూత్ పేస్ట్‌ను వాడరాదు. కాల్షియం విటమిన్ సి ఉన్న ఆహార పదార్థాలు అధికంగా తీసుకోవాలి. 2024- 25 సంవత్సరంలో 147మంది ఫ్లోరైడ్ అనుమానితులకి వీల్ చైర్స్ వాకర్స్ పోలిటబుల్ టాయిలెట్ చైర్స్ బెల్ట్ వాకర్స్ అందించాం.



తిరుమలలో ఏఐ సేవలు

- త్వరలో అందుబాటులోకి..

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో





శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్వహించే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ) ఏఐ టెక్నాలజీని వినియోగించనుంది. భక్తుల దర్శన అనుభవాన్ని మెరుగుపరిచేందుకు అత్యాధునిక టెక్నాలజీలను ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో) జె.శ్యామలారావు తెలియజేశారు. ఈవో వెల్లడించిన వివరాల ప్రకారం, ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత విధానాలను ఉపయోగించి భక్తులను ధృవీకరించనున్నారు. దాంతో పాటు, దొంగ పాస్‌లను, భక్తుల పేర్లను వాడి జరిగే మోసాలను నిరోధించడమే లక్ష్యంగా టీటీడీ ఈ చర్యలు తీసుకుంటోంది. 'టీటీడీ మార్కెట్లో అందుబాటులో ఉన్న అత్యుత్తమ టెక్నాలజీ పరిష్కారాలను, ముఖ్యంగ ఏఐ ఆధారిత వ్యవస్థలను ఉపయోగించి భక్తుల యాత్రను మరింత సులభతరం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది' అని శ్యామలారావు పేర్కొన్నారు. ఈ టెక్నాలజీని అమలు చేయడం ద్వారా భక్తులకు సమయానుకూల దర్శన టోకెన్లు జారీ చేయబడతాయి. ప్రతి భక్తుని ముఖచిత్రం తీసి, గత 30రోజుల్లో సేకరించిన దాదాపు 10లక్షల చిత్రాలతో అనుసంధానం చేసి, నకిలీ బుకింగ్‌లను అడ్డుకుంటారు.

ఈ విధానం ద్వారా టోకెన్ జారీ, ధృవీకరణ ప్రక్రియ వేగంగా, సమస్యలు లేకుండా పూర్తవుతుంది. దీంతో నకిలీ టిక్కెట్లు, బుకింగ్ మోసాలకు పూర్తిగా చెక్ పడుతుంది. ముఖ గుర్తింపు టెక్నాలజీని క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లు, ఆలయ అంతర్గత ప్రాంతాల్లో భక్తుల సంఖ్యను గమనించడానికి కూడా ఉపయోగిస్తారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ కెమెరాలు భక్తుల కదలికలను రియల్ టైంలో గుర్తించి, దర్శన సమయాన్ని అంచనా వేసేందుకు సహాయపడతాయి. 'ఈ విధానం ద్వారా భక్తులు క్యూ లైన్‌లో చేరినప్పుడు తగిన సమాచారం పొందవచ్చు. వారు తమ యాత్రను ముందస్తుగా ప్లాన్ చేసుకోవచ్చు' అని ఈవో తెలిపారు. అలాగే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ కెమెరాల ద్వారా దర్శన మార్గాల్లో అనవసర ఖాళీలు లేదా ఆపరేషనల్ లోపాలను గుర్తించి సరిచేయవచ్చు. భవిష్యత్‌లో తిరుమలలో చొరబాటుదారులను గుర్తించేందుకు ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ కీలకంగా ఉపయోగపడనుంది. మొత్తంగా, శ్రీవారి భక్తుల సేవల్లో పారదర్శకత, సమర్థత, భద్రతను పెంచే లక్ష్యంతో ఈ టెక్నాలజీని అన్ని విభాగాల్లో విస్తరించనుంది.

యోగా మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: యోగా మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం రెండు రోజులు నిర్వహిస్తున్నామని డిఆర్ఓ కె.మోహన్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ఆదివారం చిత్తూరు పట్టణంలోని పివికేఎన్ ప్రభుత్వ కళాశాల యోగా హాల్‌లో డిఆర్ఓ డిఎస్‌డిఓ బాలాజీ, ఆయుష్ మెడికల్ ఆఫీసర్, యోగ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాస నాయుడులతో కలసి యోగా మాస్టర్ ట్రైనర్లకు శిక్షణా కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమంను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, నెలరోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో యోగ చేయడం వల్ల కలిగే ఆరోగ్య లాభాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ పొందిన ఫిజికల్ డైరెక్టర్లు, పిఈటిలు యోగా శిక్షకులు వారివారి విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారా యోగాంధ్ర కార్యక్రమంను విజయవంతం చేయొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, యోగా శిక్షకులు మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ పొందిన ప్రతిఒక్కరూ మండల స్థాయిలో గ్రామాలలోని వారికి శిక్షణ ఇవ్వవలసి ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఈ శిక్షణ కార్యక్రమంలో యోగాను శ్రద్ధగా నేర్చుకోవాలని తెలిపారు. ఈనెల 28 నుంచి మే 30వ తేదీ వరకు ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, యోగా శిక్షకులు మండల స్థాయిలో ప్రతి గ్రామం నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు: ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసు కార్యాలయంలో ఈనెల 26వ తేదీ సోమవారం జరగాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటన సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్జీదారులు సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలతో జిల్లా పోలీసు కార్యాలయంలోని రావ్దొదని ఎస్పీ ఆప్రకటనలోతెలిపారు.

అక్రమ కట్టడాలు తొలగింపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరలయంలోని ప్రసాదాల పోటు నుంచి వెళ్లే వ్యర్థ నీరు గొడ్డేరులో కలవకుండా స్థానిక సన్నిధి వీధిలో నిర్మించిన పలు అక్రమ కట్టడాలను ఆదివారం దేవస్థానం అధికారులు తొలగించారు. ఎవరైనా దేవస్థానానికి అనుబంధంగా ఉన్న స్థలాల్లో అక్రమ కట్టడాలు కడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీఈవో కృష్ణారెడ్డి, సిబ్బంది నాగభూషణం యాదవ్, ప్రతాప్, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో గాయని స్మిత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రముఖ గాయని స్మిత ఆదివారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.



యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ 2025

పరీక్షా కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జిల్లాలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ 2025 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పి.జి కళాశాల, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ కాలేజీ అఫ్ సైన్స్ పరీక్ష కేంద్రాలను స్టేట్ అబ్జర్వర్, జిల్లా ప్రతేక అధికారి కోన శశిధర్, జాయింట్ సెక్రటరీ ఎస్.జి అజ్మీరా, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా రెవిన్యూ అధికారి జి.నరసింహులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పరీక్షలకు మొత్తం 5261 మంది అభ్యర్థులకు గాను 2941 (55.90 %) మంది అభ్యర్థులు హాజరయ్యారని, 2320 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. అలాగే మధ్యాహ్నం పరీక్షలకు మొత్తం 5261 మంది అభ్యర్థులకు గాను 2929 (55.67 %) మంది అభ్యర్థులు హాజరయ్యారని, 2332 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.



యూపీఎస్సీ పరీక్షల కేంద్రాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్, జిల్లా కలెక్టర్

కానరాని గిట్టుబాటు ధర

ప్రజాశక్తి -సోమల: మామిడి రైతులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర కనిపించడం లేదు. తాము ఎంతో కష్టంతో కాపాడిన పంటకు తగిన ధర లభించకపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తుందని మామిడి రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని గిట్టుబాటు ధర

సోమల మండలంలో మామిడి పంట ఓ మోస్తరుగా సాగవుతుంది. ఎంతో కష్టంతో కాపాడిన పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో మండలంలోని రైతులు కాయలు కోయలేక, కోసి అమ్మినా నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు. మండలంలో ప్రతి ఏటా అధిక సంఖ్యలో రైతులు తోటలు కలిగి సీజన్‌లో కాసే కాయలు కోసి అమ్మి లాభాలు ఆర్జిస్తుంటారు. అయితే ఈ ఏడాది మండలంలో మామిడి పంట అధికంగా కాపు కాయడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తీరా సీజన్ వచ్చి కాయలు అమ్మేందుకు మార్కెట్ కు తెస్తే గిట్టుబాటు ధర లేక నష్టానికి అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడుతోందంటున్నారు.

వెంటాడుతున్న నష్టాల భయం

మండలంలో బేనీషా, పుల్లూర మల్లిక, బెంగళూరు తోతాపురి తదితర రకాల మామిడి పండ్లు మండలంలో పండుతాయి. మే నెల ప్రారంభం నుండి మామిడికాయల సీజన్ మొదలైంది. జూన్ జూలై వరకు అమ్మకాలు ఉంటాయని రైతులు అంటున్నారు. ప్రతి ఏడాది మామిడి చెట్లకు నాలుగు నుండి ఐదు సార్లు క్రిమి సంహారక మందు కొట్టాల్సి వస్తుందని 3వేల లీటర్లకు 2,300 రూపాయలు వెచ్చించి పిచికారీ చేశామని తెలిపారు. ఈ మంగు, నల్లగా ఉండడం, పూతరాలకుండా ఉండేదుకు, పిందె నిలవడానికి మందులు తప్పనిసరిగా పిచికారీ చేశామని పేర్కొన్నారు. టన్ను 15వేల రూపాయలకు పైగా ఉంటే రైతుకు గిట్టుబాటు అవుతుందని ప్రస్తుత పరిస్థితిలలో అంత ధర మార్కెట్లో లేకపోవడంతో వచ్చిన మేరకు అమ్ముకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతో తమను నష్టాల భయం వెంటాడుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ధర వుంటేనే మామిడి పండిస్తాం..

రైతుల ఆందోళన

మండలంలో రైతుల సౌకర్యార్థం ప్రైవేటు మార్కెట్ మామిడికాయ కొనుగోలు కేంద్రాలను మూడు ప్రదేశాలలో మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. తీరా రైతులు కాయలను కోసి ట్రాక్టర్లలో, ఆటోలలో మండికి తరలించినా స్థలం లేకపోవడంతో అన్‌లోడ్ చేయడానికి ఒక్కోసారి 24 గంటలు నిరీక్షించాల్సి వస్తోంది. మామిడి కాయలు అమ్మితే కమీషన్, కూలి డబ్బు అన్ని పోను గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టం వస్తోందని రైతులు

- ● వెంటాడుతున్న నష్టాల భయం
- ● భయాందోళనలో మామిడి రైతులు

పేర్కొంటున్నారు. సోమల ప్రైవేటు మార్కెట్ యార్డులో కొనుగోలు చేసిన మామిడికాయలు ఢిల్లీ, మహారాష్ట్ర, పంజాబ్ గుజరాత్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇక్కడ పనిచేసే కూలీలు కూడా ఇతర ప్రాంతాల నుండి వచ్చి సీజన్ కూలి పనులు చేసి సీజన్ అయిపోగానే తమ స్వస్థలాలకు వెళ్తున్నారు. ఇలా ధర లేకుండా నష్టాలు చవిచూసే పరిస్థితి ఏర్పడితే తాము భవిష్యత్తులో మామిడి పంట పండించలేని పరిస్థితి ఏర్పడుతుందని ప్రభుత్వం రైతులను ఆదుకుని గిట్టుబాటు ధర కల్పించి నష్టాల బాట నుండి గట్టెక్కించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.


మామిడి కాయలను అన్‌లోడ్ చేసేందుకు వేచి ఉన్న ట్రాక్టర్లు


మామిడి కాయలు ఎప్పుడు అన్‌లోడ్ అవుతాయా అని వేచి ఉన్న రైతులు


మార్కెట్‌కు తెచ్చిన మామిడి కాయలు మండిలో రాసులుగా పోసిన దృశ్యం


మామిడి కాయలు నింపేందుకు సిద్ధంగా ఉన్న ఖాళీ ట్రేలు

క్రైం న్యూస్


మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసులు

నందిని ఆత్మహత్య కారకుల అరెస్ట్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: నందిని ఆత్మహత్యకు కారకులైన భర్త, అత్తను అరెస్ట్ చేశామని సిఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు తంబగానిపల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన ఉదయ్ కుమార్ భార్య నందిని వారం రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనలో అత్త భర్త వేధించడం వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నట్టు ఉత్తరం రాసి ఉంచడంతో దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతుండగా ఆదివారం తంబుగాని పల్లి మలుపు వద్ద ఇద్దరిని అదుపులో తీసుకుని రిమాండ్‌కు పంపామని తెలిపారు.



భక్తులతో మర్యాదగా వ్యవహరించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసే భక్తుల తోటి ఆటో డ్రైవర్లు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని వన్ టౌన్ సిఐ గోపి ఆటో డ్రైవర్లకు సూచించారు. స్థానిక రైల్వే స్టేషన్ ఆటో స్టాండ్ డ్రైవర్లతో ఆదివారం రాత్రి సిఐ గోపి సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరూ యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలని, డ్రైవర్ల చిరునామా, వివరాలు పోలీసులకు తెలియజేయాలని సూచించారు. భక్తులు రైలు దిగేటప్పుడు బలవంతంగా ఆటోలో ఎక్కించుకునే సాంప్రదాయాన్ని మానుకోవాలని సూచించారు. భక్తుల ఇష్ట ప్రకారం వారి కోరిన అతిథి గృహాల వద్ద దింపాలని తెలిపారు. నిబంధనలు పాటించుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఆదివారం ఉదయం స్థానిక బాలాజీ కాలనీలోని జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం, తిరంగా ర్యాలీ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యాదవ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నరసింహ యాదవ్, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల, డిప్యూటీ మేయర్ మునికృష్ణ , రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ మొర్రిమేకల దేవరాజులు, సేవా కుటుంబం సభ్యులు సూరా శ్రీదేవి, సరళ, కార్గిల్ యుద్ధ వీరులు మాజీ సైనికులు ఎ.పి నాయుడు, అమర రాజ ప్రతినిధి చంద్ర బాబు, గుర్రప్ప, మార్పు సేవాసంస్థ దళవాయి గుర్రప్ప, ఉపాధ్యాయులు సాంబి రెడ్డి, బాలాజీ, డాక్టర్ రాజ పాల్గొన్నారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నడకతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని ప్రముఖ న్యాయవాది సంజీవి తెలిపారు. ఆదివారం వాకర్స్ అసోసియేషన్ భవనంలో వాకర్స్ అధ్యక్షులు కేఎల్‌ఎం మూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాకర్స్ నడిచే సమయంలో రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం డాక్టర్ రవి రాజు మాట్లాడుతూ నడకతో బీపీ షుగర్ ఉండే జబ్బులు వంటి వ్యాధులు నివారించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ గవర్నర్ రావుల మాధవ నాయుడు, కార్యదర్శి మునికృష్ణయ్య, కార్యనిర్వహణ కార్యదర్శి రఫీ అహ్మద్, గోపికృష్ణ, మురుగే రెడ్డి, చిన్న, కుప్పయ్య శెట్టి, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కరుణీక సంఘం ఆధ్వర్యంలో ప్రోత్సాహక నగదు, ప్రశంసా పత్రాలను అందజేశారు. స్థానిక విజయలక్ష్మి డిగ్రీ కాలేజీ ఆవరణలో కరుణీక సంఘం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆదివారం ఘనంగా సత్కరించింది. భవిష్యత్తులో కూడా ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థులు మరింత ముందుకు వెళ్లేందుకు ప్రోత్సాహకాలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.ఏ.మునిసురేష్ పిళ్ళై, కె. విశ్వనాధ పిళ్ళై, పి.చంద్రశేఖర్, పి.ఎస్. ప్రకాష్, కె.ఉమా శంకర్, కె. దామోధరం, యు.రజినీకాంత్, కె. శ్యామ్ రాజ, చరణ్, యు.వసంత్ కుమార్, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: అంధత్వ నివారణే లక్ష్యంగా జైన్ సంఘం నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక జైన్ ప్రార్థనా మందిరంలో తిరుపతి అరవింద ఐ హాస్పిటల్ వైద్య నిపుణులు 161 మంది కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 93 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేసి ఆదివారం సాయంత్రం తిరుపతి అరవింద్ ఐ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా జైన్ సంఘం ప్రతినిధి సుభాష్ జైన్ మాట్లాడుతూ ప్రతినెల చివరి ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్లకు ఎంపికైన వారికి ఉచిత రవాణా, వసతి ఏర్పాటు చేసి ఎలాంటి ఖర్చులు లేకుండా ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైన్ సంఘం ప్రతినిధులు, అరవిందో ఐ ఆసుపత్రి, వైద్య నిపుణులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంగ జాతర

ప్రజాశక్తి -పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు మండలం బయప్ప గారి పల్లె పంచాయతీ మండిపేట కోటూరులో శనివారం రాత్రి గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి గంగమ్మ శిరస్సును విశేషంగా అలంకరించి బాణాసంచా వేడుకలతో, నయాడి డాన్సులతో మేళ తాళాలతో వైభవంగా కోటూరు పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం ఉదయం నుండి అమ్మవారి విశ్వరూప దర్శనం కొనసాగుతోంది. మండిపేట కోటూరు గ్రామస్తుల కాక చుట్టుపక్కల గ్రామస్తులు చిత్తూరు జిల్లాలోని పలువురు అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం నిమజ్జనంకార్యక్రమంతో గంగ జాతర ముగుస్తుంది.


విరిగిన విద్యుత్ స్తంభం

విరిగిన విద్యుత్ స్తంభం

పజాశక్తి -సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు బీసీ కాలనీ వద్ద సోమల కందూరు ప్రధాన రహదారి పక్కన విద్యుత్ స్తంభం విరిగిపోయి ఒరిగి ఉండి విద్యుత్ వైర్ల సహాయంతో వేలాడుతూ ఉంది. విరిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని మార్చి కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


నారాయణస్వామిని, కృపాలక్ష్మిని పలకరిస్తున్న వైసిపి నాయకులు

ఆప్యాయ పలకరింపు..

ప్రజాశక్తి -వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు వైసిపి సమన్వయకర్త కృపాలక్ష్మిని, మాజీ డిప్యూటీ సీఎం, వైసిపి రాష్ట్ర అడ్వైజర్ కమిటీ సభ్యులు కె నారాయణస్వామిని ఆదివారం పుత్తూరులోని క్యాంపు కార్యాలయంలో పలువురు వైసిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆప్యాయంగా పలకరించి వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిస్థితులను ఆయనకు వివరించారు ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మరకాలకుప్పం రామయ్య, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు శివాజీ పాల్గొన్నారు.


లక్ష్మమ్మకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే థామస్

లక్ష్మమ్మకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: బాలగంగనపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్, టిడిపి నేత దేవరాజులు తల్లి లక్ష్మమ్మ (88)శనివారం ఉదయం మృతి చెందింది. ఆదివారం లక్ష్మమ్మ మృతదేహానికి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమనాయుడు, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ , మండల టిడిపి అధ్యక్షుడు స్వామి దాస్ , కృష్ణా రెడ్డి, యువరాజు రెడ్డి, జమీర్, ప్రతాప్ రాజు, నారాయణ రెడ్డి, సతీష్, సగికుమార్, పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి నేత దేవరాజులును పరామర్శించారు.


మాట్లాడుతున్న హ్యూమన్ రైట్స్ అండ్ కంట్రోల్ ఫోర్స్ ఛైర్మన్

చిన్నారిని హతమార్చిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పట్టణంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ ఛైర్మన్, నేషనల్ ప్రెసిడెంట్ మాదేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాదేశ్ మాట్లాడుతూ మొన్నటి దినం మైలవరం మండలం కంబాల దిన్నె గ్రామంలో నాలుగేళ్ల అభం శుభం తెలియని చిన్నారిని అరటిపండు ఇస్తానని ఆశ చూపించి మానవ మృగం రహంతుల్లా అలియాస్ కబీర్ చిన్నారిపై లైంగికదాడికి పాల్పడి బండరాయితో కొట్టి హత మార్చాడన్నారు. చిన్నారి మృతదేహాన్ని ముళ్ల పొదల్లో పడేసి అమాయకంగా నటిస్తున్నాడన్నారు. చిన్నారి తల్లిదండ్రులు ప్రొద్దుటూరులో నివసిస్తున్నారన్నారు. బంధువుల పెళ్లికి కంబాల దిన్నె వచ్చి తల్లిదండ్రులు పెళ్లి కార్యక్రమంలో వుండగా నిందితుడు చిన్నారిని తీసుకెళ్లి ఇంత ఘోరం చేశాడన్నారు. ఈ మానవ మృగాన్ని ఉరిశిక్ష వేయాలని ఆయన కోరారు.



శాకాహార ర్యాలీలో పాల్గొన్న పిరమిడ్ ఫెస్టివల్ సొసైటీ సభ్యులు


కొత్తపల్లి మిట్టలో శాకాహార ర్యాలీ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : 108 ప్రదేశాల్లో శాకాహార అవగాహన ర్యాలీలు పిరమిడ్ ఫెస్టివల్ సొసైటీ ప్రపంచ శాంతి కోసం మహా శాకాహార అవగాహన ర్యాలీలు ఆదివారం నిర్వహించించారు. అందులో భాగంగా ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లి మిట్టలో మల్లీశ్వరి, రవి గురూజీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి మిట్ట కూడలిలో చిత్తూరు పుత్తూరు రోడ్డుపై ప్లే కార్డులు పిరమిడ్ ఆకారాలను తలపై ధరించి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆలోచన విధానం బాగుంటే అన్ని శుభాలేనని పిరమిడ్ జీవనం వల్ల ఆనందమయం లభిస్తుందన్నారు. మాస్టర్ మల్లీశ్వరి ఆలోచన ఆచరణ ఆహారం, ఆనందం, లాంటివి జీవితంలో ప్రాధాన్యత చూపుతాయని గురూజీ అన్నారు. శాకాహారం శరీరానికి హారంగా ఉంటుందని, రోగాల బారి నుంచి భయపడ బయటపడవచ్చని ప్రతి ఒక్కరూ పిరమిడ్ జీవితాన్ని ప్రారంభించాలని ఈ సందర్భంగా మల్లీశ్వరి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సుజాత, లింగేష్, శారదా దంపతులు శ్రీదేవి కుమార్ , నాగరాజు పిళ్ళై, సుధాకర్, సూరిరెడ్డి పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

18 ఏళ్ల నీటి సమస్యకు పరిష్కారం

- ఎమ్మెల్యే థామస్ చొరవ
- బోరు ఏర్పాటుతో పుష్కలంగా నీరు
- స్థానికులు, పిల్లల తల్లిదండ్రుల హర్షం

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 18 ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య ఎమ్మెల్యే థామస్ చొరవతో బోరు ఏర్పాటు చేయడంతో పుష్కలంగా నీరు పడింది. దీంతో స్థానికులు, వసతి గృహం పిల్లల తల్లి దండ్రులు హర్షం వ్యక్తం చేశారు. వెదురుకుప్పం మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో గత 18 ఏళ్లుగా తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానిక టిడిపి నేత మోహన్ మురళి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే శనివారం రాత్రి బోరు ఏర్పాటు చేయించారు. బోరులో నీరు పుష్కలంగా రావడంతో పిల్లల తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో వసతి గృహానికి తాగునీటి వసతి లేక పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వసతి గృహానికి పంచాయతీ నీరు మాత్రమే అందు బాటు లో వుంది. పంచా యతీ నీరు అందు బాటులో లేని సమయాల్లో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై గతంలో పలు మార్లు అప్పటి వైసిపి నేతల దృష్టికి తీసుకువెళ్లినా వాళ్లు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే త్వరగా చర్యలు చేపట్టడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఎమ్మెల్యే చొరవతో ఏర్పాటు చేసిన బోరు

మహానాడును విజయవంతం చేద్దాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : కడపలో నిర్వహించనున్న మహానాడును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ ఆ పార్టీ కార్యకర్తలను కోరారు. ఆదివారం ఎస్ఆర్‌పురం టిడిపి కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ మహానాడుకు ఒక్కొక్క మండలం నుంచి పది నుంచి 20 బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. మహానాడు తర్వాత మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక కార్యకర్తల అభీష్టం మేరకే వారు ఎన్నుకున్న వ్యక్తినే మండల అధ్యక్షుడిగా నియమిస్తామని హామీ ఇచ్చారు. వాట్సాప్ లో సోషల్ మీడియాలో తాను మండల పార్టీ అధ్యక్ష పదవులకు లంచాలు తీసుకొని అభ్యర్థులను ఎంపిక చేస్తున్నా మని 90 ఎంఎల్ బ్యాచ్ ప్రచారం చేస్తోందని దీన్ని నమ్మొద్దని కార్యకర్తలకు చెప్పారు. నిరూపిస్తే ఎమ్మెల్యే



పదవికి రాజీనామా చేసి చెన్నై వెళ్లి పోతానని పేర్కొన్నారు. మహానాడులో నియోజకవర్గ ప్రత్యేకత చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, జిల్లా కార్యదర్శి గంధమనేని రాజశేఖర్ నాయుడు, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, యువ నాయకుడు పైనేని మురళి, నియోజకవర్గ ఆరు మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్య, చంద్రప్రభలపై వేణుగోపాలుడి విహారం

ప్రజాశక్తి -కార్వేటినగరం: రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం సంతాన వేణుగోపాలుడు శ్రీకృష్ణునిగా సూర్యప్రభ, రాత్రి చంద్ర ప్రభవాహనాలపై విహరించారు. 5గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యపూజలు, ఆస్థానం, గంట తదితర కార్యక్రమాలను టీటీడీ ఆర్చకులు పూర్తి చేశారు. అనంతరం వేణుగోపాలుడు సూర్యప్రభ వాహనంపై స్వర్ణాభరాలు, సుగంధ పుష్పాలు, పట్టుపీతాంబరాలతో అలంకరించి శ్రీకృష్ణునిగా వాహనంపై విహరించారు. సాయంత్రం 5.30గంటలకు ఆలయ ఆవరణంలో ఉన్న ఊంజల్ మండపంలో స్వామివారని కొలుదీర్చి అన్నమయ్య సంకీర్తనలతో ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనంపై పురవీధుల్లో విహరించారు. భజనలు, కోలాటాలు, గ్రామీణ సంప్రదాయ వాయిద్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, ఆలయ అధికారి సురేష్ కుమార్, షారాబ్ బాబు సురేష్, కంకణభట్టర్ తరుణ్ కుమార్, వేద పండితులు నారాయణ దాసరి, గోపాలా చారి. శభరీష్, రమేష్, ధన్వంతరి, ప్రశాంత్, టీటీడీ ఆలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు బుధవారం వేణుగోపాలుడు ఉభయ దేవేరులతో రథంపై ఊరేగనున్నారు. ఉదయం 7.25 గంటల నుంచి 9.30 వరకు మాడవీధులు, మండపం వీధి, బజారువీధి, తూర్పు వీధి, బ్రాహ్మణ వీధుల మీదుగా రథ యాత్ర కొన సాగనుందని ఆలయాధికారి సురేష్ కుమార్ తెలిపారు. సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రికి అశ్వవాహనంపై విహరిస్తారని పేర్కొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మండలంలోని కుమ్మరపల్లి గ్రామంలోని కోదండ రామచంద్ర ఆలయం వార్షికోత్సవంలో భాగంగా గ్రామానికి చెందిన దానకర్ణ రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గడ్డం గోవింద్ రెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద రెడ్డి, సుబ్రహ్మణ్యం పిళ్లై, గురునాథం, గ్రామస్తులు పాల్గొన్నారు.



ముగిసిన మహాభారత ఉత్సవాలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి, కొటార్ల పల్లి, కొత్తపల్లిమిట్ట, బసివిరెడ్డిపల్లి, కొత్తపల్లి గ్రామంలో ద్రౌపది ఆలయ ఆవరణంలో ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ ఘట్టం అలరించింది. మధ్యాహ్నం అన్నదానానికి కొత్తపల్లి గ్రామానికి చెందిన హరిబాబు, యామిని దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఉభయ దారులుగా వ్యవహరించారు. దుర్యోధుని ప్రతిమను మట్టితో ఏర్పాటు చేయగా పాపిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన రూపేష్ భీముడిగా, పాటూరు గ్రామానికి చెందిన కుమార్ దుర్యోధనుడిగా వేషధారణ చేసి పద్యాలు పాటలు పాడు తూ జనాన్ని ఆకట్టుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అగ్నిప్రవేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆలయ ధర్మకర్త నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు , గ్రామస్తు లు పాల్గొన్నారు.

కార్వేటినగరం: కత్తెరపల్లిలో వెలసిన శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ ఘట్టం పలువురిని అలరించింది. మధ్యాహ్నం భాగవతారిణి హరికథా కాలక్షేపాన్ని కనులకు కట్టినట్లు ఆలపించారు. అనంతరం శ్రీవెంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. దుర్యోధనుని భీమసేనుడు గంగ మడుగు నుండి తీసుకొచ్చే ఘట్టం చూపరులను ఆకట్టుకొంది. రాత్రి అగ్నిగుండ ప్రవేశం నిర్వహిం చారు. గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర పరిధిలోని 11వ డివిజన్ బండపల్లి లోని ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయం వద్ద మహాభారత యజ్ఞం


కార్వేటినగరంలో

మహోత్సవం ముగిసింది. చివరి ఘట్టమైన దుర్యోధన వధ ప్రదర్శన పలువురికి ఆకట్టుకుంది.

సోమల: సోమల మండలం నంజంపేట సమీపంలోని గార్గేయ నది ఒడ్డున ఉన్న గౌరీ లింగేశ్వర స్వామి ఆలయం వద్ద మహాభారత యజ్ఞంలో ఆదివారం అర్జునుడు తపస్మాన్ అధిరోహించే సన్నివేశాన్ని కళాకారులు నిర్వహించారు.